'ధనమూల మిదం జగత్' అన్నమాటలోని సత్యాన్ని ఆచరణలో తనకేగాక ఆ 'జగత్తు'కు కూడా వర్తిస్తుందని గుర్తిస్తున్నారా?

# "ఓం ప్రకృత్యైనమః"

శుక్రవారపు పూజ ఆరంభమయింది. దాశరథి ఎవరో కస్టమర్ అడిగిన సూట్‌కేస్‌లు స్టోర్ రూమ్‌లో నుంచి త్వరగా బయటకు తీయించాడు. కస్టమర్స్‌నీ, సేల్స్ కుర్రాళ్ళనీ, బల్లల మీద పరచిన వస్తువులనూ, కోలాహలాన్నీ కొద్ది నిముషాలపాటు పక్కకు పెట్టి పూజలో నిమగ్నం కావటానికి దేవుడి పటాలవైపు కదిలాడు. అతని తండ్రి గళ్ళాపెట్టె దగ్గర కూర్చుని బేరాలు చూస్తున్నాడు. తండ్రికి అవతల ఒక మూలగా దేవుడి పటాలు, పురోహితుడు.

ముసలాయన తప్పుకుంటే ఆపటాలకీ, పూజకీ మరికొంత దగ్గరగా వెళ్ళవచ్చన్న భావం కలిగింది. కానీ ఆయన కాష్ చూస్తేనే తనకి ఈ మాత్రమైనా పూజ గురించి పట్టించుకునే వీలవుతుంది. తండ్రికి యివతల కొద్ది క్షణాలు కళ్ళు



మూసుకుని కూర్చున్నాడు దాశరథి.

"ఏమండీ! క్షమించాలి! మిమ్మల్ని అడగటం మంచిదని అడుగుతున్నాను. ఏమీ అనుకోకండి!"

దాశరథి ఒక్కసారి కళ్ళు తెరిచాడు. ఆ గొంతు తన యింట్లో అద్దెకు వుంటున్న వుద్యోగి మూర్తిది. ఆ గొంతు ఏవో గొంతులు తెగబోతున్నంత మెత్తగా, మర్యాదగా వుంది.

మూర్తి గళ్ళాపెట్టె దగ్గర ముసలాయనతో మాట్లాడుతున్నాడు.

"ఇందాక మీకు కాగితంమీద ఇంటి అద్దె, కరెంట్, ఖాతాల లెక్కతోపాటు డబ్బు యిచ్చాను చూడండి. అందులో ఒక యాభై కాగితం ఏమైనా పొరబాటున యెక్కువ యిచ్చానా?" మూర్తి చాలా సంకోచిస్తూ, దిగులుగా అడుగుతున్నాడు.

దాశరథి కళ్ళు చాలా ప్రశాంతంగా తండ్రివైపు తిరిగినై. ముసలాయనస్థితి ఎండబెట్టి వెలిగించిన సీమ టపాకాయల బొత్తిలాగా వుంది.

తన కొంపే మునిగినట్లు, తన యాభై రూపాయలే గల్లంతు అయినట్లు బెంబేలు పడుతున్నాడు. డ్రాయర్ హడావుడిగా లాగి—

"అయ్యయ్యో! గాభరాపడకండి! మీరిచ్చిన డబ్బు మీ కాగితంలోనే చుట్టి వేరేగానే పెట్టాను. తిరిగి చూద్దాం వుండండి"- అని ఆ కాగితం పొట్లం బయటకు లాగాడు ముసలాయన. డబ్బు లెక్కపెట్టాడు.

అవును. ఒక యాభై కాగితం ఎక్కువ వచ్చింది.

మూర్తి తన గుండెమీదనుంచి పెద్ద బరువు దిగినట్టు తృప్తిగా నిట్టూర్చాడు. ముసలాయనకీ కొంచం తెలివి వచ్చింది. లక్ష్మీదేవి నామాలు వినిపిస్తున్నై. కొంచెం తటపటాయించాడు.

"అబ్బాయిగారూ! ఏమీ అనుకోనంటే ఒక మనవి! వ్యాపారస్తులం. శుక్రవారం గడపతొక్కిన లక్ష్మిని బయటకు పంపటానికి సంకోచంగా ఉంది. రేపు తీసుకుంటారా?" ముసలాయన వినయంగా అడిగాడు.

"సరే!" అని హాయిగా నవ్వుతూ "నమస్తే!" అని చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు మూర్తి.

* * *

"శుక్రవారంపూట గడపతొక్కిన లక్ష్మి!"

# ఈ మోటార్ పవరు ఇంతేనా?

మెట్లపల్లి కామేశ్వర శర్మ



ఆ రాత్రి మంచంమీద పడుకున్న దాశరథికి నిద్రపట్టటంలేదు. ముసలాయన మాటలు మనసులో ఏ కొం .ం కదిలినా అల్లకల్లోల మవుతోంది. చిర్రెత్తుతోంది.

మనిషికి ఏకోశానా వ్యాపార సరళిలేదు. ఏం? మూర్తిగారు వస్తూనే దేనికి ఆ ఖంగారు? చిరునవ్వుతో శాంతంగా ఆ మనిషిని కూర్చోబెట్టవచ్చుకదా? "మా అబ్బాయిని కనుక్కుంటాను వుండండి!" అని దాటించ వచ్చుకదా? ఇల్లు ఆయనది కాదు. వ్యాపారం ఆయనదికాదు. ఎందుకు అంత ఆత్రం? అయినా ఆ కాగితంలో డబ్బు మూర్తిగారు ఇచ్చినది మాత్రమే అని నమ్మకం ఏమిటి? ముసలాయనే పొరబాటున ఒక యాభై కలిపేశాడేమో? గల్లాలోది పొరబాటుగా కలిసిందేమో?

మూర్తిగారు అదె యివ్వడానికి వచ్చినపుడు తానేదో బేరం హడావుడిలో వున్నాడు. ఆయన ఆ డబ్బు ముసలాయనకి యిచ్చి వెళ్ళాడు. ఆ తరువాతైనా తాను ఆ డబ్బు చూసుకుంటే బాగుండేది. చూసుకోనందుకు శిక్షగా గడపలోకివచ్చిన లక్ష్మి తిరిగి వెడుతోందా?

పది. పదిహేను సంవత్సరాలపాటు నల్లేరుమీగ బండిలా నడిచింది తన వ్యాపారం. రెండు మూడు సంవత్సరాలుగా వ్యాపారంలో పోటీ విపరీతంగా పెరుగుతోంది. మొన్న మొన్నటివరకు బక్కగా ఉన్న వ్యాపారస్తులు తనని మించిపోతున్నారు. ఈ మధ్యనే తిరిగి తను తెలివి తెచ్చుకుంటున్నాడు. గాజు షోకేస్‌లూ, డెకొలామ్ పరపించిన బల్లలూ, ఫాన్‌లు, లైటింగ్, తివాసీలు, అలంకరణతో కొటుని ఆకర్షణీయంగా రీమోడల్ చేయించాడు. విపరీతంగా ఖర్చు అయింది.

ఈ పోటీ. ఖర్చూ చూస్తే తనకి భయంగా ఉంది. వ్యాపారం అంటే అంతు తెలియని ఏటిలోకి ఒక్కొక్క అడుగే దిగటంలా ఉంది.

చాలా విచిత్రంగా- సరిగ్గా పూజ జరుగు

త్వరలో
"తాతయ్య ప్రేమలీలలు"
సినిమాగా రాబోతున్న
శ్రీమతి గోవిందరాజు సీతాదేవి
రచన :
తాతయ్య గరల్ ఫ్రెండ్ 8.00
(నవల)
ఇంకా
సన్మానం (నవల) 8.00
పుస్తకం ధర M. O. పంపండి.
క్వాలిటీ పబ్లిషర్స్,
విజయవాడ-2.

సినిమా తారలు
నేటిమేటి సినీ తారలు శ్రీదేవి. సుజాత, జయసుధ, జయప్రదల ఫొటోల సెట్టు కావాలంటే 5 రూ॥లు. కేవలం ఒకే ఫొటో కావాలంటే రూపాయిన్నర. పాత కొత్త నటీనటుల, దర్శకుల, రచయితల, సినీ నిర్మాణ సంస్థల అడ్రసులు- ఫోను నెంబర్లుగల పుస్తకం కావాలంటే 2 రూ॥లు ఈ క్రింది అడ్రసుకు మనియార్డరు చేయండి.
వై. కె. మూర్తి,
దాసరివారి వీధి. విజయవాడ-2.

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

తున్నప్పుడు వచ్చాడు మూర్తిగారు.

"రేపు తీసుకుంటారా ?" - అని మనవి చేసుకుంటున్న తండ్రి ముఖం మనసులో మెదిలి దాశరథి మంచం మీద చిరాకుతో లేచి కూర్చున్నాడు. శుక్రవారం పూట గడపతొక్కిన లక్ష్మిని ఇవాళ పంపితేనేం? రేపు పంపితేనేం? పూజ జరుగుతున్నప్పుడు తనకీ. పటాలకీ మధ్య కూర్చున్న ముసలాయన- తనకీ, లక్ష్మీ కటాక్షానికీ మధ్య అడ్డంగా తిష్టవేసిన దురదృష్టమే అనిపించింది దాశరథికి.

జరిగినదేదో జరిగింది. తను వ్యాపారస్తుడు. దేనికీ చిరాకుపడకుండా. ఎవరినీ చిరాకు పడనీయకుండా తాను చేయవలసినది చెయ్యాలి ?ఏమి చెయ్యాలి?

దాశరథికి మెరుపులాగా ఒక పరిష్కారం తోచింది. తను తండ్రికి ఖర్చుల కోసం నెలకి వంద ఇస్తున్నాడు. ఈ నెల యాభై రూపాయలే ఇస్తే సరి. అవును బయటకు పోయేది తన గళ్ళాలోకి వచ్చిన లక్ష్మి కాదు. ముసలాయన జేబులోని లక్ష్మి.

తెల్లవారింది.

నిద్ర చాలకపోవటంవల్ల దాశరథికి కళ్ళు మండుతున్నాయి. స్నానం చేసి దేవుడిదగ్గర అగరు పుల్లలు వెలిగించి నమస్కారం చేసుకుని యాంత్రికంగా డైనింగ్ టేబుల్ముందు కూర్చున్నాడు. వేడి వేడి ఇడ్లీలు. కడుపులో మంటగా ఉంది. అయిష్టంగా తినడానికి ఉపక్రమించాడు.

మేడదిగి పుసులు కారుతున్న ముఖంతో పక్కబట్టలు చంకలో పట్టుకుని ఇంట్లోకి వస్తున్న సత్యం కనుపించాడు. అసహనంతో వాడివైపు చూశాడు దాశరధి.

"దొరగారికి ఇప్పుడు మెలుకువ వచ్చిందన్న మాట!" అన్నాడు. ఆ వెంటనే వీడితో ఇల్లాంటి సంభాషణ ఇల్లాంటి మాటతో లోగడ అనేకసార్లు ఆరంభమయినట్లు స్ఫురించింది.

ఇల్లాంటి సంభాషణలు ఆరంభమయిన కొత్తలో మొదటి రెండు, మూడు సార్లు వాడు భయంతో నిలబడిపోయేవాడు. సెకండ్ షోకి వెళ్ళినందుకు సిగ్గుపడినట్లు ఉండేవాడు. కానీ ఈమధ్య చాలా మామూలుగా నిలబడుతున్నాడు వాడు. ఆ సినిమాలు చూడకా తప్పదు, ఈ సంభాషణలు భరించకా తప్పదు అన్నట్లు. స్విచ్ వేసే నిలబడే యంత్రంలా కొంచెంసేపు నిలబడి "ఫో!" అన్నాక తన దోవన తను పోతున్నాడు.

కానీ యిప్పుడు ఈ సంభాషణకి వాడి ప్రతిచర్య దాశరధికి ఛెళ్ళు మన్నట్లు తగిలింది.

వాడు క్షణంసేపు ఆగి, తల వెనుకకు తిప్పి. దాశరథినిచూసి "నిన్న రామాపురం మీరే పంపారు. తిరిగి వచ్చేసరికి రాత్రి మూడయింది" అని ఆగకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ షాక్ నుంచి దాశరథి పూర్తిగా తేరుకోలేదు. పక్కగదిలో ముసలాయన సత్యంతో ప్రశాంతంగా అంటున్న మాటలు వినిపించినాయి.

"త్వరగా ముఖం కడుక్కుని తెములు! కొట్టుకు బయల్దేరు!"

దాశరథికి ఒళ్ళు భగున మండింది.

"వెధవా! ఏమిటా పొగరు ?" అని ఆ సత్తిగాడిని రెండు పీకటానికి బదులు వాడిమీద జాలి.

అసలీ ముసలాయనకి తనంటే అభిమానం ఉందా ? ఆ సత్తిగాడిమీద ఏమిటి ఈ ఆప్యాయత. ఆ సత్తిగాడు ఆయనకి పినతండ్రి కొడుకు కొడుకు. బీద కుటుంబం. తన ఇంట్లో ఉంటున్నాడు. తను తిండీ, బట్టా ఇస్తున్నాడు. ఇంట్లో మనిషిగా చూసుకుంటున్నాడు. కొట్లో తనకి సహాయంగా వుంచుకుంటున్నాడు. ఈ సత్తిగాడికి విశ్వాసం పోతోంది. కొట్లో సామాన్లూ, డబ్బూ కాజేయటం అలవాటవుతోంది.

ఇప్పుడు వాడు తనకి పొగరుగా జవాబు ఇస్తున్నాడు. వాడి మీద ముసలాయనకి జాలి.

కోపాన్ని దిగమింగి టిఫిన్ పూర్తి చెయ్యటానికి పూనుకున్నాడు దాశరధి.

"దాశరధీ! నువ్వొక విషయం తెలుసుకోవాలి!" - ముసలాయన డైనింగ్ హాల్ లోకి వచ్చాడు. డైనింగ్ టేబుల్ముందు ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"ఏమిటది?" దాశరధి తల యెత్తకుండా ముభావంగా అడిగాడు.

"సత్యానికీ యిరవై ఏళ్ళు వస్తున్నాయి. వాడూ పెళ్ళి చేసుకుని ఒక యింటివాడు కావలసినవాడు. వాడికి నువ్వు జీతం యేర్పాటుచేస్తే బాగుంటుంది."

ఆశ్చర్యంగా నోరు తెరిచి తండ్రివైపు చూశాడు దాశరధి. ఏమిటి ఈయన ధోరణి? వాడికి వయసు రావచ్చు. పెళ్ళి చేసుకోవాలనిపించవచ్చు. సరదాగా చిన్న కార్లో షికార్లు చేద్దామనిపించవచ్చు. వాడి కోరికలు తీర్చటానికి తన దగ్గర ఏమైనా డబ్బులు రాసులు పోసుకుని ఉన్నాయా ? వాడి అవసరాలు చూడగలిగిన మనిషి తన పరిస్థితి చూడడేం ?

అయినా జీతమో, జీతమో అన్న మూలుగు ఈ మధ్య యెక్కువ అవుతోంది. సత్యం తల్లిదండ్రులుకూడా అడుగుతున్నారు. వాడు చేసేపనికి తిండీ

బట్టా కాక యింకేమి యివ్వాలి? అయినా తప్పదు. ఈ మూలుగు ఏదో విధంగా వదిలించుకోవటమే మంచిది.

"ఎంత యివ్వమంటావు?" ఉద్రేకాన్ని అణుచుకుని శాంతంగా అడిగాడు దాశరధి.

ఎక్కడినుంచి వచ్చాడో ఠక్కున సత్యం ప్రత్యక్షమయ్యాడు. వాడు ఈ సంభాషణ వింటున్నాడు. ముసలాయన వాడక్కడ ఉన్నాడని తెలిసే అన్నాడో, తెలియకే అన్నాడో కాని.

"నెలకి వంద ఇవ్వు!" అని మామూలుగా అన్నాడు.

"వంద రూపాయలా?" అని కొయ్యబారిపోయి నోరు తెరిచాడు దాశరధి. "అది మనకొట్లో తిండీ, బట్టా లేకుండా పనిచేసే మిగతా కుర్రాళ్ళకిచ్చే జీతం!" అన్నాడు.

"నిజమే, అయినా వాడు మన చుట్టాల కుర్రాడు. నిండు మనసుతో వాడికి ఆ మాత్రం చేస్తే మనకి ఆ ఫలితం ముట్టక పోదు." అన్నాడు ముసలాయన.

దాశరధి మాట్లాడలేదు. నిండు మనసట! మనసు! అది ఈయనకే వుంది. తనకి లేదు.

"ఆ జీతం ఇస్తే ఈ పుసులు కారే ముఖం లేకుండా నిండు మనసుతో పని చేస్తాడా?" - అకసుగా అడిగాడు దాశరధి.

"ఇచ్చి చూడు!" అన్నాడు ముసలాయన. ఆ తరువాత సత్యాన్ని చూస్తూ "త్వరగా తెములరా! కొట్టుకి పోదాం!" అన్నాడు.

దాశరధి ఒక నిర్ణయానికి వచ్చాడు.

"నీకూ బాగా వయసువచ్చింది. కొట్టుకెందుకు? అనవసరపు శ్రమ!" అన్నాడు దాశరధి.

"శ్రమ ఏముంది? గళ్ళాపెట్టెదగ్గర కూర్చోవడమేకదా! ఖాళీగా కూర్చుని ఏం చేస్తాను?" అన్నాడు ముసలాయన.

"గళ్ళాదగ్గర కూర్చునిమాత్రం చేసేదేముంది? గళ్ళాలోకి వచ్చిన లక్ష్మిని ఈనాడు కాకపోతే, మరునాడు పంపటమే కదా!" అన్నాడు దాశరధి

ముసలాయన కొద్ది క్షణాలు చేష్టలుడిగి నిలబడ్డాడు. "సరే! నీ ఇష్టం? ఇవిగో కొట్టు తాళం చెవులు!" అని నీరసంగా తాళాలు బల్లమీద పెట్టి "అయితే నేను చిన్నాడి దగ్గరకు వెడతాను!" అన్నాడు.

"నీకదే ఇష్టమైతే నిన్ను ఆపను!" అన్నాడు దాశరధి.

చెమ్మగిల్లిన కళ్ళతో కొడుకుని చూశాడు ముసలాయన. "నా బిడ్డవి. నీ మంచికోసం చెబుతున్నాను. బాగా గురుంచుకో. వ్యాపారానికి నీ మనసు నిర్మలంగా వుంచుకో. పని కుర్రాళ్ళవి, కొట్టుకొచ్చే వాళ్ళవి అందరి మనసులూ నిర్మలంగా వుంచుకో" అని సంచీ సర్దుకోవటానికి వెళ్ళిపోయాడు.

* * *

ఆదివారం.

ముసలాయనవెళ్ళి వారం అయింది. దాశరధికి ప్రపంచం అంతా ఖాళీ అయినట్లుంది. ఎందుకో చాలాఅలసటగావుంది. పరిస్థితి నీరు కారుతున్నటువుంది. వరండా స్తంభాన్ని ఆనుకుని పరధ్యానంగా నిలబడ్డాడు దాశరధి.

వ్యాపారానికి మనసు నిర్మలంగా వుండటం అవసరమే కావచ్చు. మనసు నిర్మలంగా వుంచుకునే మార్గం గళ్ళాలోకి వచ్చిన లక్ష్మిని బయటకు పంపటమా? పని కుర్రవాళ్ళ గొంతెమ్మ కోరికలన్నీ తీర్చుకుంటూ కూర్చోవటమా?

"ఏరోయ్!" అన్న కేకకి దాశరధి ఈ లోకంలోకి వూడిపడ్డాడు.

ఊడిపడి ఇంటిముందు రోడ్డుమీదకు దృష్టి సారించి ఆ మనిషిని చూసేలోగా, ఆ మనిషి రయ్‌ని నడుపుతున్న మోటార్ సైకిల్ ఆ రోడ్డు దాటేసింది. వాడు లక్ష్మీపతి. స్కూల్లో తన క్లాస్‌మేట్. పెనుగాలి లాంటి మనిషి.

వాడి జాతకమూ అంతే. పట్టింది బంగారమవుతోంది. వాడు పట్టకుండా వదిలేస్తున్నదీ లేదు. ఇటీవల కొందరితో కలిసి పేపర్‌మిల్ పెట్టాడు.

అంతే. జాతకమే. భగవంతుడు నొసటన వ్రాసి ఉంచుతాడు- ఈ మోటార్ పవరు ఇంత అని. ఎంత గింజుకున్నా అది అంతకన్నా ఎక్కువ నడవదు. తనూ అంతే.

ముసలాయన తన మనసు కనిపెట్టగలిగితే తనకెంత బలం? ఇంటో తమతో పాటు తింటూ, సుఖంగా వుంటున్న చుట్టాల కుర్రాడికి ఆ విశ్వాసం వుంటే తనకెంత దండి? ఈ వ్యాపారం ఇల్లా వుంటుందా?

తన పవరు ఇంతే. ఈ కొట్టుమాత్రమే. దీనిలో మునిగిపోకుండా వుంటే అదే పదివేలు.

దాశరధికి ఉన్నట్టుండి రోడ్డు మీద పోతున్న శాస్త్రిగారు కనిపించారు. ఆ క్షణంలో దాశరధి మనస్థితిలో ఒక కొత్త మార్పు వచ్చింది.

తనకిప్పుడు కాలక్షేపం కావాలి ఇప్పుడు ఈ కాలక్షేపానికి ఈయన సరియైనమనిషి.

ఈ మనిషి ప్రతి శుక్రవారం పూజ చేస్తున్నాడు. తన జాతకం యింతే అయితే ఈ పూజ యెందుకో ఈయనను అడగాలి. ఈయన ఏమి చెబుతాడో చూడాలి.

గేటు దగ్గరకువెళ్ళి శాస్త్రిగారిని పిలిచి, "శాస్త్రిగారూ! నాకు కొన్ని సందేహాలున్నాయి. మీకు వీలున్నప్పుడు కాస్త మాట్లాడుకుందామా?" అని అడిగాడు దాశరధి.


## ఇది నిజమా!

"అదృష్టవంతులూ, అపార మేధాసంపత్తులూ మాత్రమే డాక్టర్లూ, ఇంజినీర్లూ కాగలరు"

కాదు. ముమ్మాటికీ కాదు.

లక్ష్యం, దాని సాధనకు కృషీ వుంటే ప్రతి ఒక్కడికీ ఫలితం వుంటుంది. కానయితే దీనిలో కాలం పాత్ర విలువైనది. దీనికి గత 5 సం॥ల మాఫలప్రద శిక్షణానుభవమే ఋజువు. కాలం విలువైనది. దాన్ని వృథా చెయ్యకండి.

లక్ష్యం మీకుంటే సాధనా, కృషీ మేం చేయిస్తాం.

M. B. B. S.. మరియు B. Tech.. ఎంట్రెన్స్ పరీక్షల శిక్షణకై అడ్మిషను ప్రారంభింపబడినవి.

బాలికలకు ప్రత్యేక హాస్టలు వసతి కలదు.

2వ బ్యాచ్ తరగతులు— జూలై 3 నుండి

**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్,**

**స్టేట్‌బ్యాంక్ వద్ద, కర్నూలు_518 004.**

# మల్లెపందిరి

## సూత్రపాతం

బొమ్మ వెయ్యదల్చుకున్నవారు కనపడీ కనపడని గీతలతో స్కెచ్ వేసుకుంటారు. భూమి కొలతలకూ, రేఖాగణితం బొమ్మలకూ మార్కింగ్ పెట్టుకుంటారు. వాటిమీద తరువాత గీయవలసిన బొమ్మ తేలుతుంది. ఆ మొదటి రూపమైన నిర్ణయాన్నే సూత్రపాతం అంటారు. తాళ్ళతో కొలతలన్న మాట.

కరతరలితబంధం కంచుకం కుర్వతీనాం
ప్రతిఫలిత మిదానీం దైప మాత్మామ మర్చిః।
స్తనతట పరిణాహే భామినీనాం భవిష్య
న్నఖపదలిపి లీలా సూత్రపాతం కరోతి॥

—గందినకుడు

చేతులతో రవిక ముడి వేసుకుంటూండగా ప్రతిఫలించిన ఎర్రని దీవపు కాంతి భామినుల విశాల స్తనతటంమీద ఏర్పడబోయే నఖపద లిపికి సూత్రపాతం చేస్తోంది.

వారి వ్రేళ్ళ సందులనుంచి ఏర్పడిన కాంతిరేఖ చూసి ఇది నఖపదం పడవలసిన చోటు, ఇది ఆకృతి అని నాయకుడికి సూచనగా తోచిందన్న మాట. నఖపదం=గోటి గీరు.

—సౌభరి

"ఇప్పుడే మాట్లాడుకుందాం! పదండి" అంటూ లోపలికి వచ్చాడు శాస్త్రిగారు.

ఇద్దరూ వరండా అరుగుమీద కూర్చున్నారు. శాస్త్రిగారిని ఒక ఊపు ఊపటానికే అన్నాడో, శుక్రవారపు పూట గడపలోకి వచ్చిన లక్ష్మి కదిలి పోయిందన్న బాధే కలుక్కుమందోకాని దాశరధి సంభాషణని ఒక పద్ధతిలో ఆరంభించాడు.

"మీరు మంత్రాలు చక్కగా చదువుతారు. పూజ ఎంతో బాగా చేయిస్తారు. నేనూ మంత్రాలు చాలా శ్రద్ధతో వింటున్నాను. అల్లాంటిది శుక్రవారపు పూట అనుకోకుండా గడపలోకి వచ్చిన డబ్బు పూజ జరుగుతుండగా దాటిపోయిందనుకోండి. దానికి కారణం ఏమై ఉంటుంది" అని అడిగాడు దాశరధి.

శ్రద్ధగా విన్న శాస్త్రిగారు ఒక చిరునవ్వు నవ్వారు. అది సర్వాంతర్యామి అయిన భగవంతుణ్ణి స్మరిస్తూ నవ్వే చిరునవ్వు. నవ్వి-

"బహుశ మనం పూజిస్తున్నది డబ్బుని అయి వుండదు" అనిసమాధానంచెప్పారు.

ఆయన సమాధానం తన కాళ్ళకింద చాపని రపీమని గుంజినట్లై, నిలదొక్కుకోడానికి ప్రయత్నిస్తూ "చిక్కు విడదీయమంటే ఉన్నమతి పోగొట్టకండి!" అన్నాడు దాశరథి.

శాస్త్రిగారు నవ్వి "అవును. మనం పూజించేది లక్ష్మిని. డబ్బుని కాదు" అని దాశరధి మొహంచూసి ఆ వెంటనే "లక్ష్మి దేవి పటం చూశారా? ఒక పద్మంలో కూర్చుని వుంటుంది. అరచేతినుంచి ధనం వర్షిస్తూ వుంటుంది. మనం పూజించేది ఆ ధనాన్నే అయితే పటాల్లో ఆ పద్మమెందుకు? ఆ పద్మంలో ఆవిడెందుకు?" అన్నారు శాస్త్రిగారు.

దాశరధి ఆలోచనలో పడ్డాడు. ఆలోచించి ఒకమాట అన్నాడు. "కావలసినది ధనం. అది గడపదాటి పోతుంటే ఆ పద్మంతో మనకి దేనికి? దానిలోని అమ్మవారితో మనకి దేనికి?" అన్నాడు దాశరధి.

"బిచ్చగాళ్ళు రూపాయలు కోరుకుంటారు. వ్యాపారస్థులు రూపాయలు పుట్టే మార్గాలు వెతుక్కుంటారు" - అన్నాడు శాస్త్రిగారు.

దాశరధి నొసలు చిట్లించి, ఆ మాటలను నెమరువేసుకుని "లక్ష్మి రూపాయలు పుట్టించే మార్గం అంటారు. రూపాయలు కాదంటారు" అని చిరునవ్వు నవ్వాడు. శాస్త్రిగారు మౌనంగా నవ్వారు.

"గడపలోకి వచ్చిన రూపాయలు పూజ జరిగేటప్పుడు బయటకుపోయి మనసు కుంగిపోతుంటే రూపాయలుపుట్టే మార్గాలు ఎల్లా కనిపిస్తాయి?" అన్నాడు దాశరధి ఆలోచిస్తూ.

"రూపాయలు బయటకుపోవటం పూజ జరిగేటప్పుడు జరిగింది కనుక మనసు అసలే కుంగకూడదేమో? మీ దృష్టిని రూపాయలనుంచి రూపాయలు పుట్టించే మార్గంవైపు తిప్పటానికి అది అమ్మవారు అవలంబించిన పద్ధతేమో?" అన్నారు శాస్త్రిగారు.

దాశరథి అయోమయంగా చూశాడు. శాస్త్రిగారు ప్రశాంతంగా మాట్లాడుతున్నారు.

"గడపలోకి వచ్చిన రూపాయలకు పొంగిపోకుండా గడపదాటిపోయిన రూపాయలకు కుంగిపోకుండా మీ దృష్టి స్థిరంగా వుంటే, సిరి సర్వత్రా కనిపిస్తుంది, అల్లా కనుపిస్తే - రూపాయలే సిరి అన్న బురదలో కూరుకున్న మీ మనః పద్మం వికసించినట్లు. వికసించిన మనః పద్మం రూపాయలు వర్షించే అమ్మవారి ఆననం" అన్నారు శాస్త్రిగారు,

సిరి సర్వత్రా కనిపించడం - అన్న భావాన్ని అందుకోటానికి యత్నిస్తున్నాడు దాశరధి.

"మీ కొట్టు, కొట్టులో పనిచేసేకుర్రాళ్లు, కొట్టుకు వచ్చే ఖాతాదార్లు, కొట్టు బయట ప్రపంచం- ఈ ప్రకృతి సర్వం అమ్మవారి రూపమే. అందుకే పూజలో మొట్టమొదటి నామం- "ఓం ప్రకృత్యై నమః" మనసుని ఈ భావంలో దృఢంగా నిలుపుకుని ఈ ప్రపంచంలో వ్యవహరించడమే నిజమైన పూజ. ఈ ప్రపంచం అవసరాలని మీరెంతగా గుర్తించి ఆరాధిస్తే, ఈ ప్రపంచం మీ ఈప్సితాలని అంతగా వర్షిస్తుంది."

యాదృచ్ఛికంగా గడపలోకొచ్చిన రూపాయలనూ, ప్రపంచాన్ని ఆరాధిస్తే ప్రపంచం వర్షించే ఈప్సితాలనూ దాశరథి మనసు తూకం తూస్తోంది.

"ఈ ప్రపంచం స్థిరంగా ఉండదు. చంచలంగా ఉంటుంది. దీని అవసరాలు మారిపోతూ ఉంటాయి. ఈ మార్పులను సహనంతో గుర్తించి అర్ధం చేసుకుంటూ దీనిని ఆరాధించటమే- రెండవ నామం. "వికృత్యైనమః"తో పూజించడం. రూపాయలే ప్రధానమన్న భ్రాంతితో మనసు ముడుచుకుపోతుంది. కుంగిపోతుంది. ఈ మార్పులనుంచి కురిసే వర్షం ఆగిపోతుంది. ఆగకుండా నిలుపుకోడానికే ఈ పూజలు" అన్నారు శాస్త్రిగారు. ●